

# మృతజీవులు

పురిటి గదిలోనుంచి బాధగా అరుపులు వినిపిస్తున్నాయి. పావిడిలో నుంచుని గదిలోపలికి చూస్తూ,

"ఏమిటే, ఎల్లా ఉంది? పిల్లమరి ప్రాణలేక నీరసించి పోతుందేమో! కొంచెం ఏ పాలో పొయ్యండి..." అంటున్నాడు జగన్నాథం.

ఆయన పక్కనే నిలబడ్డాడు సుందరం. అతని చెవులూ, కళ్లూ ఆత్రంగా నిక్కబొడుచుకున్నాయి జరగబోయేదేమిటో ఊహిస్తూ.

కొంచెంసేపటికి గదిలోనించి నర్సు బయటికి వచ్చింది. మామా, అల్లుళ్లిద్దరూ ఆమెవేపు చూశారు ఆదుర్దాగా, ఏం చెపుతుందా అన్నట్టు.

నర్సు ఏం మాట్లాడకుండా బయటికి నడిచింది. నర్సు వెనకాలే వెళ్లబోయిన జగన్నాథం ఆ ప్రయత్నం మానుకుని గదిలోకి వెళ్లాడు. గడపదగ్గిరగా నిలబడి డాక్టరువేపు చూస్తూ,

"ఎల్లా ఉంది?" అన్నాడు నీరసంగా.

డాక్టరు చేతులు తుడుచుకుంటూ ఇవతలకువచ్చి, "వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి" అన్నది ముభావంగా.

పిడుగు పడినట్లయింది జగన్నాథానికి. 'మళ్లీ ఏమిటీ అవాంతరం.'

"ఏం? వరీగా చెప్పండి. పిల్లకి ఎట్లా ఉంది?" వణుకుతున్న కంఠంతో ప్రశ్నించాడు.

"ఆపరేషన్‌చేసి బిడ్డను తీయాలి. కాన్పు సజావుగా అవుతుందని నమ్మకంలేదు . . ."

డాక్టరుమాటలు పూర్తికాకముందే మంచంమీద పడుకున్న పావిత్రి గబుక్కున లేవబోతూ,

"ఆపరేషన్ . . . వద్దు . . . వద్దు" అంటూ భయంగా ఏమో చెప్పబోయింది. ఆమె కంఠంలో

సి.హెచ్. శాంతాదేవి

కలవరాన్నీ, భయాన్నీ గమనించి జాలిగాచూస్తూ డాక్టరు ఆమె లేవకుండా పడుకోబెట్టి,

"మరేం ఫరవాలేదు" అంది గది బయటకువస్తూ.

జగన్నాథం ఆమె వెనకాలే వచ్చాడు.

"పెద్దప్రాణానికి భయం లేదుగదా!"

"మరేమీ భయంలేదు. అమ్మాయికి ధైర్యం చెప్పండి."

డాక్టరు వెళ్లిపోయింది. డాక్టరు మాటలు విన్న సుందరం కోపంగా, విసురుగా బయటకు వెళ్లిపోయాడు. జగన్నాథం అదేమీ గమనించకుండా కూతురి దగ్గిరికి వెళ్లి తలమీద చెయ్యివేసి మెల్లిగా అన్నాడు.

"నీకేమీ ఫరవాలేదమ్మా! నేనున్నంతకాలం. . ." తండ్రి కళ్లల్లోకి దీనంగా చూస్తున్న పావిత్రికళ్లల్లో నీళ్లు తిరిగి చెంపలమీదుగా జారాయి.

పావిత్రిని నిమిషాలమీద ఆస్పత్రిలో చేర్చారు.

ఆపరేషన్ ముగిసింది. కాని ప్రయోజనం కాలేదు.

సావిత్రి కులాసాగానే ఉంది. కాని . . . ఆమె శరీరంలోనించి మృత శిశువును బయటకు తీశారు.

రాత్రి పది గంటలు దాటింది. ఆస్పత్రి జన సంచారం లేక నిర్జనంగా ఉంది.

మంచంమీద పడుకున్న సావిత్రి మగతగా కళ్లు విప్పింది. ఆమె కనుపాపలు దీనంగా చలిస్తున్నాయి.

"బిడ్డ . . . నా బిడ్డ" కలవరిస్తున్నట్టు అంది.

నర్సు వచ్చి "మీరు విశ్రాంతి తీసుకోండి" అంటూంది.

సావిత్రి ఆమె మాటలు వినలేదు.

"నాబిడ్డ . . . నా పాప ఏదీ?" ఒంట్లో శక్తినంతా కూడదీసుకుని మాట్లాడుతూంది.

నర్సు మాట్లాడలేదు. సావిత్రి ఆమెవేపు చూస్తూంది అతి జాలిగా.

ప్రాధేయపూర్వకంగా . . . నర్సు తలవంచుకుని నిలబడింది.

డాక్టరు అక్కడికి వచ్చింది. సావిత్రి దగ్గరగా వచ్చి తల నిమిరింది మెల్లిగా.

"చెప్పండి" అంటూంది సావిత్రి.

"మృతశిశువు . . . ఇంకా . ." చెప్పలేక చెబుతున్నట్లున్న డాక్టరు మాటలు లీలగా సావిత్రి చెవుల్లో దూరాయి. అంతకుమించి వివేకశక్తి లేనట్టు, అప్పటికే కళ్లు మూతలు పడిపోతున్న సావిత్రి 'మృతశిశువు' అని తనలో తను గొణుక్కుంటూ స్పృహతప్పి పడిపోయింది.

* * *

సావిత్రిని ఇంటికి తీసుకుని వచ్చారు.

రాత్రి జగన్నాథం, సుందరం వీధి గదిలో కూర్చున్నారు. జగన్నాథం మొదలుపెట్టాడు సంభాషణ.

అల్లుడివేపు చూడకుండా, "రేపు నే వెడతానోయ్" అన్నాడు.

సుందరం మాట్లాడలేదు. కొద్దిసేపాగి జగన్నాథం తిరిగి అన్నాడు.

"నాతోకూడా అమ్మాయిని తీసుకువెడదా మనుకుంటున్నాను." సాధ్యమైనంత నిదానంగా అన్నాడు.

అల్లుడి నోట ఏం జవాబు వస్తుందో ఆయనకు తెలుసు. సుందరం ఇబ్బందిగా పెట్టాడు మొహం. అది గమనించి,

"పిల్ల చాలా కుంగిపోతూంది విచారంతో. కొన్నాళ్ళక్కడుంటే . . ." అని ఆగాడు.

"ఇక్కడ మటుకేమిటి అన్నగారూ . . ." సమయానికి సుందరం తల్లి వచ్చి అందుకుంది.

"ఏమిటో దాని గీత బాగాలేకపోబట్టిగానీ. . . నాకు ఆరుగురు, మా అమ్మకి తొమ్మిదిమందిమి . . . అసలు మా వంశంలోనే లేదు ఈ విపరీతం.

జగన్నాథం ఆవిడమాటలు వినటం లేదు. అల్లుడి వేపు చూస్తున్నాడు ఆదుర్దాగా. ఆయన కళ్లఎదుట సావిత్రి మొహం నిలిచింది. ఒక్కక్షణం.

'అసలు వీళ్లు మనుషులేనా?' అన్న అనుమానం కలిగింది ఆయనకు.

"ఏమంటావు సుందరం. . . దాని మనసు చాలా బాధపడుతూంది. ఈ సమయంలో ఎవరైనా అంతే

**భర్త నుండి భార్య ఆశించేది సుఖం ఒక్కటే కాదు. సత్సంతానం — తనలో మాతృత్వాన్ని పండించ గల మధురక్షణాలు. కానీ భర్త తిరుగుబోతు, సుఖరోగిఅయి, పుట్టిన బిడ్డలు పురిటిలోనే అస్తమిస్తూంటె, కన్న తల్లిఅయీ, కాలేని ఆమె ఆవేదనను అంచనా వేయడం ఎలా సాధ్యం?**

నసుకో. . . అయితే కొన్నాళ్ళ నలుగురిలోనూ తిరిగితే కొంచెం కుదుటపడుతుందేమోనని. . ."

ఆయన చూస్తున్నాడు సుందరంవేపు తదేకంగా.

సుందరం లేచి నిలబడి అన్నాడు మామగారి వేపు చూడకుండా.

"తరవాత ఎప్పుడైనా తీసుకువెళ్లవచ్చు" అనేసి అవతలికి వెళ్లిపోయాడు. జగన్నాథం కూర్చుండి పోయాడు అల్లుడు వెళ్లిన దిక్కుగా చూస్తూ.

గదిలో బెడ్‌లైట్ వెలుగుతూంది. సావిత్రిమంచం మీద పడుకుని దీపంకేసే చూస్తూంది నిశ్చలంగా. ఆమె తన తండ్రికీ, భర్తకీ జరిగిన సంభాషణ అంతా విన్నది. . . ఆమె చెవుల్లో డాక్టరు అంటున్న మాటలు గింగురు మంటున్నాయి.

"మృతశిశువు. . ." తన శరీరంల్లోంచి సజీవంగా ఇవతలకు రాని బిడ్డను కళ్లారా చూసుకునే అదృష్టం కూడా లేకపోయింది సావిత్రికి.

"మృతశిశువు. . . మృతశిశువు. . ." కళ్లల్లో నీళ్లు పక్కలకు జారాయి. మెల్లిగా లేచి తన గదిలోకి వెళ్లింది. పెట్టె తెరిచింది . . ఒక పక్కగా చిన్న మూట విప్పి చూసింది. అందులోని చిన్న చిన్న టవల్సూ, ఇంకా బుల్లి బుల్లి చొక్కాలూ, డ్రాయర్లూ. ఎవరివివన్నీ? ఏడాది క్రిందట . . కాదు. రెండేళ్ళ ఇప్పటికి. ఏం జరిగింది?

సావిత్రి కళ్ళుమూసుకుంది.

పొత్తిళ్లల్లో శిశువును బయటకు తీయకుండానే శ్మశానానికి తీసుకుపోయిన ఆ సమయం ఎటువంటిది?

సావిత్రి కళ్లలో నీళ్లు తిరిగాయి. చొక్కాల్ని పట్టుకొని తదేకంగా చూస్తూంది.

'పూర్తిగా కళ్లుతెరవని పసికూన . . . బుల్లికాళ్ళు, చేతులూ అటూ ఇటూ కొట్టుకొంటూ సన్నటి ఏడుపు. . . ఎవరు?'

సావిత్రి చప్పున అన్నీ పెట్టెలో పెట్టేసి ఇవతలకు వచ్చేసింది. . . సరిగా రెండేళ్ల క్రిందట, ఇంకా పురిటి స్నానమైనా చెయ్యని సావిత్రి తన బిడ్డకు తనివితీరా పాలిచ్చుకోటానికిగానీ, ఇంకేం చెయ్యటానికి గానీ నోచుకోలేదు. నిండా పదిరోజులు లేని ఆ పసివాడు, సరిగా కళ్లు తెరవటం కూడా చాతగాని ఆ చిన్నారి పాపాయి . . తల్లి కడుపులో చిచ్చుపెట్టి శాశ్వతంగా దూరమయ్యాడు.

డాక్టరు రావటం, లాభంలేదన్నట్టు పెదవి విరవటం అన్నీ గమనించింది సావిత్రి. ఒక్కక్షణం ఆశా, నిరాశల మధ్య ఊగిసలాడిన ఆమె మనసు. . . ఈ లోకంనుంచి పూర్తిగా సంబంధం తెంచుకున్న ఆ పసివాడినిచూస్తూ బండబారిపోయింది.

కోటి ఆశలతో, అంతులేనన్ని కోర్కెలతో పుట్టింట్లో అడుగుపెట్టిన ఆనాటి సావిత్రి. . . ఒంటరిగా బండెక్కింది, జీవితంలో మొదటిసారి వేదనా పూరిత హృదయంతో.

మళ్లీ ఏడాదికే ఆమెలో ఆశ చిగిర్చింది. ఈసారి ఆమెలో కోటి కోర్కెలు ఉవ్వెత్తున లేచాయి. కొత్త ఊహలతో రోజులు గడుపుతూంది, గడిచిన సంఘటనలు మరుపుకు తెచ్చుకుంటూ. కానీ. . . కానీ...

సావిత్రి మోకాళ్లలో తలదూర్చుకుని వెక్కివెక్కి ఏడిచింది. 'తనీ కడుపుశోకాన్ని భరించలేదు. . . మనిషికి కష్టాలుకాదు, ఇట్లాంటి ఆవేదన వద్దు పగవాడికైనా, క్షణక్షణానికీ మనసుని కోతపెట్టే ఈ దుఃఖం. . .'

జీవితంలో రెండోసారి పరాజయం పొందింది సావిత్రి. అల్లుడి ఉత్తరం చూసుకుని రెక్కలుకట్టుకు వాలిన జగన్నాథానికి, అప్పటికే ఆస్పత్రిలో చేర్చబడిన సావిత్రిని చూసి. కళ్లు బైర్లు కమ్మాయి. అయిదు నెలల కడుపుపోయింది ఆమెకి . . .

ఆ విధంగా ముగిసింది సావిత్రి రెండో కాన్పు.

* * *

లోపలకు వచ్చిన భర్తనుచూసి లేచి నిలబడింది. అతను బట్టలు సర్దుకుంటున్నాడు మౌనంగా.

సావిత్రి ఎక్కడికని అడగలేదు. అతను చెప్పలేదు. పెట్టె తీసుకుని వెళ్లిపోయాడు. సావిత్రి అతను వెళ్లినవేపే చూస్తూ నిలబడింది.

ఆదర్శానుకూల దాంపత్యం. . . ప్రేమపూరిత హృదయం . . . ఇంకా ఏమిటి తన కలలు . . కాదు ఆశలు. ఇంటినిండా కలకల్లాడుతూ పిల్లలూ. . . ఏరీ, ఎవరూలేరే? తన కలలూ లేవు, ఆశలూ లేవు. మిగిలింది జీవచ్ఛవం. . .

సావిత్రి మంచంమీద పడుకుంది కళ్లు గట్టిగా మూసుకుని. . . తను ఓడిపోయింది జీవితంలో. ముండల ముఠాకోరై తిరుగుతున్న భర్త మనస్సు మార్చలేదు. ఒంట్లో పుట్టెడు జబ్బు పెట్టుకుని రోగిష్టిమారి పిల్లల్ని కనటం తను మానదు. . . ఎట్లాగైనా వంశాంకురాన్ని పొందాలనే తహతహతో ఉన్న ఆ తల్లీ కొడుకులు మనుషులుకారు. వాళ్లల్లో మానవత్వంలేదు. తనపాలిట రాక్షసులు. తన రక్తమాంసాలు పీల్చే పిశాచులు. . . సావిత్రి కళ్లల్లో నీళ్ళు సుళ్ళు తిరిగిపోతున్నాయి.

'ఎందుకిలా అయింది నా జీవితం? నా ప్రాణాలు త్వరలో పోతే ఎంత బావుండును! . . . నేను భరించలేను. . .' సావిత్రి కళ్లల్లో నీళ్ళు కాలువలు కడుతున్నాయి. . .

* * *

మళ్లీ. . . మళ్లీ సావిత్రిని దురదృష్టవంతురాల్ని చేయటానికన్నట్టు . . . మళ్లీ సావిత్రి భర్తకీ, అత్తగారికీ మనసులో చిన్న ఆశాకిరణం. కానీ సావిత్రి ఏమాత్రం ఇష్టపడలేదు ఇలా కావటం.

"నాకే పిల్లలూ వద్దు. . . ఈ బాధా వద్దు. ఈ అవిటి పిల్లల్ని చూసుకుని నేను బతకలేను.

నే ఏ కడుపుకోతని భరించలేను . . ." మోకాళ్ళమీద తలపెట్టి వెక్కివెక్కి ఏడుస్తున్న భార్యనిచూసి మందరం మనసు కరగలేదు.

"నా ప్రాణాలు ఒక్కసారి తీసేయరాదూ?" అంటున్న సావిత్రిని నిరసనగా చూసి అవతలికి వెళ్ళి పోయాడు.

సావిత్రి మనస్సు తీవ్రంగా గాయపడ్డది. నిస్సహాయతతో కుమిలిపోయింది.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆవేదనతో క్రుంగి పోతున్న సావిత్రినిచూసి,

"చేతులారా నువ్వే బిడ్డప్రాణాలు తీస్తావే. అందరూ కనటంలా. నువ్వే మహా. . ." అంటున్న అత్తగారికి జవాబు చెప్పలేదు సావిత్రి.

"తనెట్లాగూ ఈ గ[illegible] దాటటం? మళ్ళీ తొమ్మిదినెలలూ మోసి ఎవర్ని? మృతుడా, అంధుడా? ఎవరు? . . తనెందుకిట్లా పీల్చి పిప్పిచేస్తున్నారు తన జీవితంలోకి ప్రవేశించి? దీనికి అంతెక్కడా?

"అమ్మా! మాధవ కవళం తల్లీ. . ." బిచ్చగాడి పిలుపు విని సావిత్రి బయటకు వచ్చింది అన్నం తీసుకుని. వాడి చేతుల్లో ఎముకల పోగులాంటి పిల్లవాడు. . .

"కళ్ళులేవు తల్లీ. పుట్టు గ్రుడ్డి. . ." సావిత్రి అటు చూళ్ళేక కళ్ళు మూసుకుంది.

తండ్రికి ఉత్తరం రాసింది. జగన్నాథం వచ్చాడు. తండ్రిని చూడగానే ఆమెలో అణగారిన ఆశలు పైకి లేచాయి. ఆమె మనసు పంజరం నుండి బయటపడ్డ పక్షిలా తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది . . . తండ్రిఒళ్ళో తలదాచుకుని వెక్కివెక్కి ఏడిచింది. దీనంగా తన మనస్సులో బాధ చెప్పుకుంది. . . ఈ వేదన తనిహ భరించలేనని తల గోడకేసి కొట్టుకుంది.

నిస్సహాయంగా చూడటం తప్ప ఏం చెయ్యలేక పోయాడు.

"వాళ్ళ నన్నేవిధంగా కూడా బతకనియ్య దల్చుకో లేదు నాన్నా!"

కూతుర్ని ఏవిధంగానూ ఓదార్చలేక కన్నీళ్ళుకార్చాడు.

సావిత్రి ఒకే ధ్యానతో రాత్రీ పగలూ పరితపిస్తూ ఉంది. ఆమె భయపడుతున్న రోజు రానే వచ్చింది. ఆమె అదృష్టమో, దురదృష్టమోతేల్చే రోజువచ్చింది. సావిత్రి మెదడు మొద్దుబారిపోయింది. ఆమె ఏమీ ఆలోచించే స్థితిలో లేదు. ఆ తరుణం దాటిపోయింది. దెబ్బలు తగిలీ, తగిలీ బొప్పెలు కట్టిఉన్న తలమీద మరోసారి దెబ్బకి తట్టుకోగలశక్తి నిర్జడిపోయింది ఆమెలో.

ఆస్పత్రిలో చేర్చారు. స్పెషల్ రూమ్‌లో పడుకో బెట్టారు సావిత్రిని. ఆమె మనసంతా గందరగోళ మైపోయింది. అందుకు తగ్గట్టు బయట వాతావరణం కూడా మహాబీభత్సంగా ఉంది. ఆకాశమూ, భూమీ ఏకమయ్యేట్టు కుండపోతగా వర్షం ప్రారంభ మైంది. రోడ్డుమీద కన్నుపొడుచుకున్నా కానరాని కటిక చీకటి. సావిత్రి తనకే అర్థంకాని భయోద్వేగాలతో ఉత్తేజితురాలౌతూంది. ఆమె దీనమైన ఏడుపు అందరి హృదయాల్నీ కదిలించివేస్తూంది. ఒక్కోక్షణం దగ్గిరికి వస్తూన్న కొద్దీ నిప్పు కణికల మీద దొర్లుతున్నట్టుంది. నెప్పులు ప్రారంభ మయ్యాయి. బయట వానా, గాలీ తగ్గలేదు. సావిత్రి అత్తగారు దేవుడికి మొక్కుకుంటున్నది. జగన్నాథం గారు విధిమీద భారంవేసి ఎటువంటి వార్త వినవలసి వస్తుందోనని విచారగ్రస్తులై కూర్చున్నారు.

"అంధశిశువు. . మృతశిశువు . . ." సావిత్రి పెదవులు అస్పష్టంగా అదే పదాన్ని ఉచ్చరిస్తున్నాయి. ఆ బిడ్డనుచూస్తూ తనను తను అదుపులో ఎలా పెట్టుకోగలుగుతుంది? ఆ కడుపుకోత ఎలా భరించేది? ఇన్నాళ్ళు మోసి కన్న బిడ్డని భూమిపాలు చేస్తుంటే ఎట్లా ఊరుకునేది?

సావిత్రి భర్తని తలచుకోవటంలేదు. రాబోయే క్షణాల్ని తలచుకుని భయకంపిత అవుతూంది.



సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు, తమ గానకళతో రసిక హృదయాల నాకట్టుకొన్న గాయకులు, సంగీత కళానిధి మధుర మణి అయ్యర్ జూన్ ఎనిమిది ఉదయం మదరాసులో కాలధర్మం చెందారు.

మందరం తన ప్రియురాలి సమక్షంలో సుఖంగా నిద్రించి ఉండగా రాత్రి పది గంటలకి వేదన పడీ, పడీ ఒక పాపని భూమిమీద పడేసింది సావిత్రి. మగతగా కళ్ళు విప్పింది. . . కొద్దిక్షణాల్లో తన చెవుల్లో పడేది ఎటువంటి వార్త? "అంధ మృతశిశువు. . . అవిటి బాలుడు."

"పండులాంటి బిడ్డను కన్నావమ్మా! అదృష్టవంతురాలివి. . ." నర్సు మాటలు ఆమె చెవికెక్కలేదు. అన్నిటికీ అతీతురాలైపోయింది. ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి అప్పటికే! ★


# కెయంపి టీక్ ఆయిల్

సీలు వేయబడిన 250 గ్రా., 500 గ్రా., ఒక కిలో, 2 కిలో, 4 కిలోల డబ్బాలలో లభ్యం కాగలదు.

ప్రిన్సిపాల్ ఏజంటు: కాలూరాం మహదేవ్ ప్రసాద్, 1, మదన్ మోహన్ బర్మన్ వీధి, కలకత్తా—7. ఢిల్లీలో బ్రాంచి.

టీక్ ఆయిల్ కొనేటప్పుడు




అది స్వచ్ఛంగా వుండేటట్లు కె యం పి వారిదే అయివుండేటట్లు చూసుకోండి.

KMP/6/101